# ఆశల సమాధి

## ఆదిభట్ల భగవతిరావు

ఎండ గాడ్పు ఇంకా కొడుతూనే వుంది. సమయం ఎంతయిందో తెలీదు. పని తక్కువగా ఉండటం వలన కొంచెం తీరిక దొరికింది. ఈ చెట్టుక్రింద ఎన్నాళ్ళనుండి చెప్పులు కుడుతున్నానో నాకు తెలియదు. జీవితం అలా గడిచి పోతోంది. నాకు ఆలోచనలు లేవు, ఆశలు లేవు, బంధువులు లేరు. నాకు పరిచయం వున్నవి ఆ వీధిలోవాళ్ళు తొడుక్కునే చెప్పులు. కళ్ళు మూసుకొని వున్న నేను 'తాతా' అన్న పిలుపుతో ఏదో పని వచ్చిందని చూసాను. ఎదురుగా ఎవరో కాలేజీ కుర్రాళ్ళు అనుకుంటా వచ్చేరు. వాళ్ళకి బూట్లు వున్నాయి. నాపని వాటికి లేదు. ఎందుకని చేత్తో సైగ చేశాను. అందులో ఒక కుర్రాడు నా దగ్గరగా వచ్చి ఎదురుగుండా రాయిమీద కూర్చు న్నాడు. అతను 'తాతా! నీతో కొంచెం పని వుంది. మేము కాలేజీలో చదువు తుంటాం. నేను ఎక్కువ వయస్సు కల వారిని అడిగి పూర్వపు విశేషాలు తెలుసు కొని, వారి పూర్వపు అనుభవాల్ని, అప్పటి విషయాల్ని, వారి ఆచారాలని పరిశోధించి అవి అందరకూ తెలిసేలా రాస్తుంటాను. నిన్ను చూస్తే చాలాకాలంగా నువ్వు ఈ పని చేస్తున్నట్టు తెలుస్తోంది. నీకు జ్ఞాపకమున్న నీ చిన్ననాటి విష యాలు మాకు చెప్పు. నాతో వచ్చిన ఈ కుర్రాడు అమెరికానుండి వచ్చాడు. అత నికి మన దేశంలో వున్న వయోవృద్ధులని అడిగి వారి అనుభవాలు తెలుసుకోవాలను కుంటున్నాడు. నువ్వు చెప్పు. నీ సమ యానికి అయిన డబ్బు ఇస్తాము' అన్నాడు ఇంతవరకూ నేనెప్పుడూ నా జీవితం గురించి ఆలోచించలేదు. నా చిన్నతనంలో



నా తల్లి, తండ్రికూడా తెలియదేను. అలా అల్లరిగా తిరుగుతున్న నన్ను 'దాదా' తన దగ్గరుంచుకొని చెప్పులు, జోళ్లు కుట్టడం నేర్పాడు. నాకు జ్ఞాపకం వున్న పాత రోజుల్లో బస్సులు లేవు. అందరూ నడిచే వెళ్ళేవారు. కొందరు గుర్రంపై వెళ్ళే వారు. అప్పటికి ఈ మర్రిచెట్టు చాలా చిన్నది. [illegible] దాటిపోరులు

ఇక్కడ పడుకొనేవారు. మా దాదా నాకు ఆ రోజుల్లో సిపాయిల పితూరీ జరుగుతోందని అనేవాడు. అందులో చేరుతానని వెళ్ళిపోయాడు. ఒంటరినైన నేను ఆరోజు గడిస్తే చాలునని పని చేసేవాడిని. నాకు ఏ ఆశా లేదు. రేపటి గురించి బాధ లేదు. ఆ తర్వాత ఎన్నాళ్ళు అయిందో నాకు తెలియదు. నాకు రోజు గడుస్తోంది అని తెల్సుగానీ ఎన్ని రోజులో తెలియలేదు. నా వయస్సు నాకు తెలియదని చెప్పాను. కాని ఇంకా పని చేయగలనని చెప్పాను. ఆ కుర్రాళ్ళు ఏదో మాట్లాడుకున్నారు. మళ్ళీ వస్తామని చెప్పి వెళ్ళారు. సాయంత్రం పని అయిపోయింది అనుకుంటా అందరూ హడావుడిగా తిరుగుతున్నారు. నేనూ లేద్దామనుకుంటున్నాను. ఇంతలో నా ముందు ఒక కారు వచ్చి ఆగింది. అందులోనుండి ఇందాక వచ్చిన ఆ కుర్రాడు, ఒక తెల్లదొర దిగారు. ఆ కుర్రాడు నా దగ్గరకి పరిగెత్తుకొచ్చాడు. 'తాతా! నువ్వు చెప్పినదాన్నిబట్టి నీ వయసు నూట ముప్పై సంవత్సరాలుంటుంది. నీకంటె వయస్సున్నవారు మాకు కనబడలేదు. నిన్ను ఆ దొర అమెరికా విమానంలో తీసుకెళ్తాడుట. అక్కడ నిన్ను వాళ్ళకి చూపించి నిన్ను ప్రపంచంలోకెల్లా పెద్ద వయసున్న వాడిగా చెప్పి, నీ అనుభవాలు తెల్సుకుంటాడుట. ఆ విషయాలు ప్రత్యక్షంగా టెలివిజన్లో చూపుతారుట. అందుకు నిన్ను అమెరికా తీసుకెళ్తారుట. రేపు ప్రొద్దున్న మేం వచ్చి నిన్ను తీసుకెళ్తాం నువ్వు చాలా గొప్పవాడివి అవుతావు తాతా! అని అన్నాడు. ఆ తెల్లదొర నా చెయ్యి పట్టుకొని ఏదో అన్నాడు. నాకు అర్థం కాలేదు. నాకు అర్థమయిందల్లా నేను ఈ మర్రినీడనుండి విమానంలో వెళ్తాను.

నాకు బస్సే తెలీదు. విమానం ఎలాగుంటుందో. ఇలా ఆలోచిస్తుండగానే ఆ బాబులు వెళ్ళిపోయారు. నా కెందుకో గుండెల్లో అదోలా వుంది. అమెరికా అంటే ఏంటి. ఎలాగుంటుంది. విమానం ఎక్కాలని నేను అనుకోలేదు. ఎందుకో నాకు విమానం ఎక్కాలని, అన్నీ చూడాలని, డబ్బున్నవాణ్ణి అవాలనీ అనిపించింది. అంతే రేపు ఎప్పుడొస్తుందా అని ఆరాటం ఎక్కువైంది. ఆ రాత్రి భోజనం చేయలేదు. చెట్టుక్రింద పడుకున్నాను. మొదటిసారి నాకు నిద్ర రాలేదు. అలా చూస్తూవున్నాను. రాత్రి బాగా పొద్దుపోయింది. రోడ్డుమీద ఎవరూ లేరు. కుక్కలు దూరంగా మొరుగుతున్నాయి. రేపు ఎంత వేగిరంగా వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. గబుక్కున తెల్లారిపోతే బాగుణ్ణనిపించింది. ఇంతలో వేగిరంగా ఒక కారు చెట్టుకి కొంచెందూరంలో ఆగింది అందులోనుండి ఒకడు దిగేడు. కార్లోనుండి మరొకర్ని బయటకు లాగేడు. ముందు దిగిన అతని చేతిలో ఏదో మెరిసింది. అది రెండోవాని ఛాతిలో దిగింది. బాధతో అతడు కొట్టుకొని ఆగిపోయాడు. నేను గబుక్కున లేచాను. నన్ను ఆ కారునుండి దిగిన వ్యక్తి చూశాడు. నా దగ్గరకు పరుగున వచ్చాడు. అవును, అతను అక్కడి పెద్దమనిషి. అందరూ అతన్ని చిబ్బా అంటారు. రక్తంతో అతని చెయ్యి తడిసి వుంది. నన్ను తీక్షణంగా చూసేడు. తాతా! ఈ విషయం నువ్వు చూడలేదనుకో. ఏదైనా పెదవి మెదిపేవో నీకు ఇంక రేపు వుండదు. జాగ్రత్త అని



భర్త: నాకీమధ్య మరీ మతిమరుపు ఎక్కువవుతోంది. ఇవాళ గొడుగు తీసుకెళ్ళడం మరిచిపోయాను.

భార్య: ఎప్పుడు జ్ఞాపక మొచ్చింది?

భర్త: వానవెలిశాక గొడుగు మూసేద్దామని చూస్తే — చేతిలో గొడుగు లేదు! ●

అంటూ కార్లో వెళ్ళిపోయాడు. నాకు కోపం ఎక్కువైంది. నా కళ్ళతో చూసింది పోలీసులకి చెప్పి నా కర్తవ్యం నెరవేర్చాలి అనుకున్నాను. నా మానవత్వం నన్ను ఉత్తేజ పరచింది. కాని చిబ్బా అన్న ఆఖరిమాట అదే 'రేపుండ'దని అన్నది నన్ను ఆపింది. ఇప్పుడు పోలీసులకి చెప్పి నా జీవితం ధర్మానికి అంకితం చేస్తే నాకు రేపుండదు. ఆ దొర నన్ను తీసుకెళ్తానన్న అమెరికా చూడలేను. చెట్టుక్రింద పడుకొని ఆలోచిస్తున్నాను. నాకు అమెరికా చూడాలని, ధనవంతుడ్ని కావాలని కోరిక పెరిగింది. దేశంలో నాకు తెలియకుండా ఎన్నో హత్యలు జరుగుతున్నాయి. అలాగే ఇదికూడా! నేను చూడలేదు అని అనుకుంటే హాయిగా మిగిలిన జీవితం బ్రతకొచ్చు. ఇంతవరకు పందవీళ్ళ పైబడి దరిద్రం అనుభవించేను. ఏదో అదృష్టం బాగుండి విమానం ఎక్కబోతున్నాను. ఇప్పుడీ అవకాశం వదులుకోకూడదు. నేను ఈ విషయం ఎవరికీ చెప్పను. తెల్లారితే బాగుండును. హాయిగా వెళ్ళిపోతాను అనుకుంటున్నాను. ఎందుకో నాకు గుండె బరువెక్కింది. ఒళ్ళు తేలిపోతోంది. ఇది ఆనందంతో కాదు. కళ్ళు మూతలు పడుతున్నాయి. గొంతుక ఎండిపోతోంది. ఇంక తెల్లవారదేమోనని భయంగా ఉంది.

ఇంతకాలం ఏ కోరికా లేకుండా, ఆశ దురాశలు లేకుండా బ్రతికేను. హాయిగా వున్నాను. ఏవేవో ఆశలు కల్పించారు. అంతలో తృంచేస్తోంది విధి. అవును ఇంక నేను బ్రతుకుతానన్న ఆశ లేదు. నిజమే! నిస్వార్థంతో తృప్తిగా ఉన్నంతకాలం నాకు సంవత్సరాలు గడిచినా తెలియలేదు. ఆశ లేకుండా వుండటమే నా ఆరోగ్యానికీ, ఇంతకాలం జీవించడానికీ కారణం. ఇప్పుడు నాలో మొలకెత్తిన స్వార్థం, నాకు రేపటిమీది మమత నన్ను అధఃపాతాళానికి తోసాయి. నాకు ఏం చేయాలో తోచటం లేదు. నిలబడ్డానికి శక్తి లేదు. కళ్ళు తెరుద్దామంటే తెరవటం లేదు, లీలగా తెల్లవారుతున్న ఛాయలు కనబడుతున్నాయి. భగవంతుడా! నిన్నేదీ కోరలేదు. నన్ను బ్రతికించు తండ్రీ! నేను నిజం చెప్తాను. నాకు విమానం అక్కరలేదు. నన్నిలా బ్రతకనీ! ప్రభూ అని మొక్కుకుంటున్నాను. కానీ నాకు సత్తువ రావడంలేదు. గాలి పీల్చలేకపోతున్నాను. శరీరం బరువెక్కిపోతోంది గుండె తేలిపోతోంది. ఏదో అయిపోతోంది. నాకు విమానం, చిబ్బా, కారు, కనిపిస్తున్నాయి. ఎవరెవరో పాపం తాత అన్నట్టు వినపడుతోంది. ఏదీ సరిగ్గా కనపట్టం లేదు. అంతే నాకు రేపు రానట్టు వుంది. చలనం ఆగిపోతోంది ●